జి. సి. జీవి

## ప్రేమలూ - పెళ్ళిళ్ళు

"రాజు!"

"ఊఁ..."

"ఈ రోజెంత హాయిగా వుంది రాజు! మనకాలేజి జీవితం ఈ నాటితో ముగిసిపోతుందని తలచుకుంటే బాధగా వుంది. ఇలా ఒకరి వొడిలో వొకరం ప్రతి క్షణం హాయిగా గడపగలిగితే ఎంత బావుణ్ణు. రేపు నువ్వు మీ వూరికి, నేను మా వూరికీ వెళ్ళి పోతున్నాం. ఈ సుఖాన్ని ఈ ఆనందాన్ని శాశ్వతం చేసుకోవాలని నీ కనిపించటం లేదా రాజూ?"

"ఇప్పుడున్న సుఖంలోని ఆకర్షణ అప్పుడు తగ్గిపోతుందేమో."

"అదేం మాట రాజూ! ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాళ్ళెవరూ సుఖంగా లేరంటావా? మనమధ్య ఆకర్షణ, అనురాగం ఎన్నటికీ చెరిగిపోదు రాజూ. ఆ నమ్మకం నాకుంది."

"సరే. అలాగే చేద్దాం".

"నువ్వెంత మంచివాడివి రాజు! ఊరికి వెళ్ళిన వెంటనే మా నాన్నని ఒప్పిస్తాను, ఆయన నామాట కాదనరు."

"ఒక వేళ అంటే?"

"అప్పుడు నాన్ననీ, ఆస్తినీ అందర్నీ వదిలేసి నీతో వచ్చేస్తాను. నువ్వు లేకుండా నేను బతకలేను రాజూ. మీ అమ్మ కూడా మన పెళ్ళికి అభ్యంతరం చెప్పదనుకుంటాను. ఏమంటావు రాజూ?"

"చెప్పదు."

ఆమె అతని కౌగిట్లో గువ్వలా ఒదిగిపోయింది. అత నామెని తమకంగా ఆక్రమించుకున్నాడు.

మూడేళ్ళు గడిచి పోయాయి.

హైదరాబాదులో ఒక సినిమా హాలు ముందు ఆమె కనిపించింది.

"హల్లో రాజూ!" ముందు ఆమే పలకరించింది.

పక్కనే రెండేళ్ల పాప నెత్తుకొని దర్జాగా నిలబడి వున్న భర్తని పరిచయం చేసింది. దూరంగా పార్కుచేసివున్న తన పచ్చరంగు కారుని పరిచయం చేసింది.

ఎందుకో పాప ఏడుపు కెత్తుకుంది.

"దీనికి చాక్‌లెట్లేమైనా కొని తెస్తాను. ఇక్కడే వుండు" అంటూ పాప నెత్తుకుని అటువేపు వెళ్ళాడు భర్త.

"నన్ను క్షమించు రాజూ! మనం అనుకున్నవన్నీ తారు మారయినయ్. శుభలేఖ కూడా పంపలేక పోయాను. అనుకోకుండా జరిగిపోయింది నా పెళ్ళి."

"ఎవర్ని ఎవరూ క్షమించుకో నక్కర్లేదు రాణీ. ఆవేశంలో అనుకు నేవన్నీ ... అదుగో! బాబిగాడితో మా ఆవిడ కూడా దిగుతోంది రిక్షాలోంచి. వస్తాను" అంటూ గేటు వేపుకి వడి వడిగా అడుగులు వేశాడు రాజు.

## ప్రకృతి - వికృతి

"దేవుడున్నాడని నమ్ముతావా?"

"నమ్మను"

"ఏం. ఎందుకని?"

"నేనెప్పుడూ చూళ్ళేదు గనుక. కాని దయ్యాలున్నాయని మాత్రం ఒప్పుకుంటాను."

"అదెలాగ?"

"అసూయతో, ద్వేషంతో, స్వార్థంతో దయ్యాలై తిరుగుతున్న వాళ్ళని చూస్తున్నాను గనుక. తరతరాలుగా పదవీ వ్యామోహంతో మారణ హోమాలు సృష్టించే వాళ్ళనీ, బలహీనుల్ని పీడించే అమానుషుల్నీ, అమాయకుల్ని వంచించే కుట్రదారుల్నీ, మంచి వాళ్ళని మతిభ్రష్టుల్ని చేస్తోన్న దుష్టదెయ్యాలనీ చూస్తున్నాను గనుక."

"అయితే నువ్వు దేవుణ్ణి నమ్ముతున్నా వన్నమాట"

"ఏమిటా తల తిరుగుడు మాట?"

"చిన్నప్పుడు చదువుకున్న బాల వ్యాకరణం గుర్తుందను కుంటాను?"

"రామాయణంలో పిడకల వేటా?"

"ముందిది చెప్పు. వ్యాకరణం గుర్తుందా?"

"ఎంత కథలు వ్రాసే వాణ్ణయినా ఇంకా వ్యాకరణం మరచిపోలేదులే."

"అయితే విను. ముఖము : ప్రకృతి- మోము : వికృతి స్నేహము : ప్రకృతి- నెయ్యము : వికృతి దైవము : ప్రకృతి- దయ్యము : వికృతి. కావున దేవుడే దయ్యము. దయ్యమే దేవుడు. వాడే వీడు. వీడే వాడు.

"త్వమేవాహం."

# ఆర్మీనియన్ ప్రేమ గీతాలు

## ఆనందం

### పారియర్ మికాలియన్

ఆనందం బహుశా
కవిత్వం లాంటి దేమో,
ఊడిపడుతుంది హఠాత్తుగా
శూన్యంనుంచి సైతం.

కష్టమైన జీవితంలో
నేను దాటిన రహదారులెన్నో—
కాని అనంతంగా
నేనన్వేషిస్తోన్న ఆనందం
లభించిందీ వేళ
అనూహ్యంగా
నీ వెచ్చని కౌగిలింతలో
ఈ సన్నని పుంత చెంత....

## మంచు కరిగిపోయింది

### మారీ మార్గరియన్

మంచు కరిగి పోయింది
మెత్తని, తియ్యని
నిట్టూర్పు తాకి—
అమూల్యమా రాక
అ అదృశ్య నిశ్శబ్ద ఆర్ద్రత ;
నా బ్రతుకు బాటపైని
కిరణంలా
నడుస్తోన్న దెవ్వరు?

(తెలుగు : మంగాదేవి)